సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 8 । ఏప్రిల్ । 2023



వైభవంగా ఉరుసు

శ్రీ హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి, మౌలానా మౌల్వి ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి, జహీరుద్దీన్ షా ఖాద్రి ఖుద్దస సిర్రహుం వార్ల ఉరుసు వైభవంగా జరిగింది. -10లో..



కొన'కుండ' ఉండలేరు!

ఆధునిక (మెటల్) వంట పాత్రల వాడకం ద్వారా రోగాలు కూడా మనిషిని చుట్టు ముట్టాయి. దీంతో మళ్లీ జనం మట్టికుండలు కొనాలనే ఆలోచనలో పడ్డారు. -10లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.74	రూ.90
రెండోరకం	రూ.50	రూ.72



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 252 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	475	565
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 632.88 కిలోలు

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆని) (సా.)	సహర్ (ఆది) (ఉ.)
రాజంపేట	6.32	4.48
రాయచోటి	6.32	4.45
మదనపల్లి	6.34	4.46
పీలేరు	6.30	4.40

జనంలోకి జగనన్న సైన్యం

- జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు
- ఇంటింటి సర్వే చేపట్టిన పార్టీ నేతలు



రాయచోటి: ప్రజలతో మమేకమవుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తదితరులు



బి.కొత్తకోట సభలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



వాల్మీకిపురం స్టిక్కర్లను అంటిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వం పిలుపుమేరకు అన్నమయ్యజిల్లాలో శుక్రవారం ప్రారంభమైన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి స్థానిక ప్రజలు, నాయకుల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ఈకార్యక్రమానికి ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మన్లు, ఇతర ప్రజా ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని 30, 31 వార్డులో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషాలు స్థానిక కౌన్సిలర్లతో కలిసి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్నారు. నాడు-నేడు పాలనలో వ్యత్యాసాన్ని వివరిస్తూ ప్రజలతో మమేకమయ్యారు. పీలేరు నియోజకవర్గం పరిధిలోని వాయల్పాడులో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మదనపల్లె పట్టణంలోని 17వ వార్డులోని గుండ్లూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నవాజ్ బాషా, ఏపీఎండీసీ షమీమ్ అస్లామ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు హబీబ్‌ఖాన్‌లు పాల్గొన్నారు. రాజంపేట మున్సిపాలిటీలోని ఉస్మానగర్, నారపురెడ్డిపల్లెతో పాటు రూరల్ పరిధిలో పెద్దకారంపల్లెలో నిర్వహించిన జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమంలో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. తంబళ్లపల్లె నియోజకవర్గ పరిధిలోని బి.కొత్తకోట మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని వీవీ కండ్రిక, తిమ్మిశెట్టిపల్లె ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పాల్గొని స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. 14 రోజుల పాటు నిర్వహించనున్న ఈకార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, వలంటీర్లు పాల్గొని ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలను వివరించడంతో పాటు ప్రభుత్వం సూచించిన ఐదు ప్రశ్నలతో వివరాలు సేకరిస్తూ ప్రజా మద్దతు పుస్తకాల్లో నమోదు చేస్తూ వచ్చారు. తొలి రోజు ఎమ్మెల్యేలే నేరుగా ప్రజల వద్దకు వెళ్లి గత పాలనకు, జగనన్న పాలనకు ఉన్న తేడాను వివరించడంతో పాటు జగనన్నకు ఎందుకు మద్దతు ఇవ్వాలో తెలియచెప్పే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ప్రజల అంగీకారం మేరకు ప్రభుత్వం అందచేసిన స్టిక్కర్లను ఎమ్మెల్యేలే ఇళ్లకు అంటించారు. ఎమ్మెల్యేలే నేరుగా కార్యక్రమంలో పాల్గొనడంతో సంక్షేమ పథకాలు అందుకుంటున్న ప్రజలు అదే ఉత్సాహంతో ముందుకు వచ్చి జగనన్న ప్రభుత్వానికి మద్దతు తెలుపుతామని వెంట నడవడం పార్టీ నాయకులు, కార్యకర్తలకు మరింత బలాన్నిచ్చింది.





రాజంపేట టౌన్: జగనన్నే మా భవిష్యత్ బుక్‌లెట్‌ను ప్రజలకు అందచేస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీచైర్మన్ ఆకేపాటి, మదనపల్లె: పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా



రైల్వేకోడూరు: ప్రజలతో మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

న్యూస్‌రీల్

మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వండి

రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లా కేంద్రంలో జరుగబోయే 10 తరగతి పరీక్షాపత్రాల మూల్యాంకన విధుల నుండి కొందరికి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ పేర్కొన్నారు. మూల్యాంకన విధుల నుండి చంటిబిడ్డల తల్లులు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, 60 సంవత్సరాలు పైబడి వయస్సు కలిగినవారు, జిల్లాకేంద్రం నుండి దూరప్రాంతాల వారికి మినహాయింపు ఇవ్వాలని కోరారు. అనంతరం డీఈఓ కార్యాలయం ఏడీ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో వీరితోపాటు యూటీఎఫ్ నేత సురేంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ కొండయ్య

రాయచోటి అర్బన్ : ప్రతిఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కొండయ్య పిలుపునిచ్చారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది పురవీధులలో నిర్వహించిన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్యాన్ని మించిన సంపద లేదన్నారు. ఆరోగ్యపరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ నడక, ఈత కొట్టడం, జాగింగ్ చేయడం, యోగా వంటి ఏదో ఒక వ్యాయామం చేయాలన్నారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ జంక్‌ఫుడ్స్ తినడం మానేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్, జిల్లా మాస్‌మీడియా అధికారిణి దేవశిరోమణి, హెల్త్ ఎడ్యుకేటర్ బలరామరాజు, రాజగోపాల్, కమ్యూనిటీ హెల్త్ అధికారులు, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

కమలాపురం (వైఎస్సార్‌జిల్లా) : స్థానిక దర్గా-ఏ-గఫారియాలో జరుగుతున్న అబ్దుల్ గఫార్ షా ఖాద్రి ఉరుసు మహోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం పాల దంతములు కలిగిన వృషభరాజములకు నిర్వహించిన బండ లాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 9 కాండ్ల జతల ఎడ్లు పోటీలో తలపడ్డాయి. ఇందులో ప్రొద్దుటూరు మండలం నాగాయపల్లెకు చెందిన విజయ్‌కుమార్‌రెడ్డి ఎడ్లు అత్యధికంగా 4047 అడుగులు రాతిదూలాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి.

అభివృద్ధికి సహకారం అందిస్తాం



ఆర్‌జేడీ ప్రతాప్‌రెడ్డితో మాట్లాడుతున్న సీఎం సలహాదారు ధనుంజయరెడ్డి

ఓబులవారిపల్లె: గ్రామాల అభివృద్ధికి అన్ని విధాలా సహకారం అందిస్తానని సీఎం సలహాదారు ఆర్. ధనుంజయరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గాదెల పంచాయతీ తల్లెంవారిపల్లె ప్రాథమిక పాఠశాలను ఆర్‌జేడీ ప్రతాప్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాల డీఈఓలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ధనుంజయరెడ్డి మాట్లాడుతూ మారు మూల అటవీ శివారు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత పాఠశాల విద్యను దగ్గరకు తీసుకొచ్చేందుకు తల్లెంవారిపల్లె ప్రాథమిక పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసినట్లు చెప్పారు. తాను చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయాలని సంకల్పించినట్లు చెప్పారు. భవిష్యత్‌లో దీనిని పక్కాభవన నిర్మాణాలతో మోడల్‌స్కూల్‌గా మార్చేందుకు కృషి చేస్తానని అన్నారు. గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని పలువురు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందిస్తూ గ్రామాల్లో అభివృద్ధి పనులకు సహకారం అందిస్తానన్నారు.ఇప్పటికే గాదెల 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైందని, రూ.2కోట్లతో సిమెంట్‌రోడ్డు పనులు చేయించినట్లు తెలిపారు.టీటీడీ నిధులతో శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం కూడా మంజూరైనట్లు చెప్పారు. ఆర్‌జేడీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ తల్లెంవారిపల్లె ప్రాథమిక పాఠశాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 2023-24 సంవత్సరానికి ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసినట్లు తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరం జూన్ నుంచి 6 నుండి పదో తరగతి వరకు తెలుగు మీడియం ఉన్నత పాఠశాల తరగతులు తాత్కాలిక భవనాల్లో ప్రారంభిస్తామన్నారు. పాఠశాల పక్కా భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించామన్నారు.అనంతరం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో ధనుంజయరెడ్డి విద్యాశాఖ సిబ్బందితో పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో అన్నమయ్య ,వైఎస్సార్ జిల్లా డీఈఓలు పురుషోత్తం, రాఘవరెడ్డి,డిప్యూటీ డీఈఓ వరలక్ష్మి, ఎంఈఓ పద్మజ, మాజీ ఎంపీపీ రామకృష్ణయ్య,సచివాలయల కన్వీనర్ అమర్‌నాథ్ రెడ్డి, స్థానిక నాయకులు నారాయణరెడ్డి, చిన్నిరెడ్డి గురివిరెడ్డి, కొలవల అమర్‌నాథ్‌రెడ్డి, చిన్నిరెడ్డి ఆశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముడు..కాళీయమర్దనుడు



కళాకారుల కోలాట ప్రదర్శన



కాళీయమర్దన అలంకారంలో స్వామివారు

ఒంటిమిట్ట: ఏకశిలానగరిలో కొలువైన కోదండరాముడి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభంగా జరుగుతున్నాయి. ఎనిమిదో రోజు శుక్రవారం ఉదయం కాళీయమర్దన అలంకారంలో జగదభిరాముడు భక్తులను అనుగ్రహించారు. పట్టు వస్త్రాలు, పుష్పమాలికలు, ఆభరణాలతో స్వామివారిని అందంగా అలంకరించారు. కళాకారుల చెక్క భజనలు, కోలాటాల మధ్య స్వామి వారు పురవీధుల్లో విహరించారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు స్నపనతిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ జరిగింది. రాత్రి స్వామివారు అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఒంటిమిట్ట ఆలయ డిప్యూటీ ఈవో నటేష్ బాబు, ఆధ్వర్యంలో అశ్వ వాహన వాహనసేవ జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

నేడు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ రాక

కడప వైఎస్ఆర్ సర్కిల్: నేడు కడప నగరానికి సీపీఐ రామకృష్ణ రానున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం ఇక్కడ ఆయన మాట్లాడుతూ జిల్లా పశు సంవర్ధశాఖ డీడీ అచ్చెన్న హత్యపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరుతూ కడపలోని పశు సంవర్ధకశాఖ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు చేపడుతున్న నిరసన ప్రదర్శనకు హాజరవుతున్నట్లు తెలిపారు.

కరోనాపై అప్రమత్తం

పొరుగు రాష్ట్రాల్లో కరోనా పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయి. వైఎస్సార్ జిల్లాలో ఇప్పటి వరకు ఎలాంటి పాజిటివ్ కేసులు నమోదు కాలేదు. అన్నమయ్య జిల్లా మదనపల్లెకు సమీపంలోని ఆరోగ్యవరం మెడికల్ సెంటర్‌లో ఏడుగురు వైద్యసిబ్బంది జలుబు, దగ్గుతో బాధపడుతుండగా పరీక్షలు నిర్వహిస్తే పాజిటివ్‌గా తేలింది. దీంతో వారికి తక్షణమే వైద్యచికిత్సలు అందించడంతో కోలుకుంటున్నారు. కోవిడ్‌పై కేంద్రం హెచ్చరికల నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉంది. అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది.

- ముంబైకి చికిత్స కోసం వెళ్లిన వ్యక్తికి సోకిన కరోనా
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో అనుమానితులకు ఉచితంగా ర్యాపిడ్ టెస్టులు



మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో ప్రారంభించిన కరోనా ఐసోలేషన్ వార్డు

కడప రూరల్: వేసవి కాలానికి కరోనాకు అవినాభావ సంబంధం ఉన్నట్లుంది. గడిచిన మూడేళ్ల కాలంలో ఎప్పుడైనా సరే కేసులు ఎండాకాలంలోనే నమోదు అవుతున్నాయి. తాజాగా వైఎస్సార్ ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కరోనా కేసులు ఎక్కడా లేవు. అయితే ముంబై, చెన్నై, కేరళ తదితర రాష్ట్రాల్లో ఇప్పుడిప్పుడే కేసులు వెలుగు చూస్తున్నాయి. ఈ నేపథ్యంలలో ప్రభుత్వ సూచనలతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉంది. ముందు నుంచే జాగ్రత్తలు తీసుకుంటోంది.

వైద్యం కోసం వెళ్లిన వ్యక్తికి కరోనా....

వైఎస్సార్ జిల్లాలోని కమలాపురం పరిధిలో గల పెద్ద చెప్పలి వాసి చికిత్స కోసం ఇటీవల ముంబైకి వెళ్లారు. అక్కడ ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ఐదారు రోజులుగా చికిత్స పొందుతున్నారు. ఆ రోగికి సర్జరీ చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆస్పత్రి వైద్య సిబ్బంది సదరు వ్యక్తికి 'స్క్రీనింగ్'చేయగా అందులో కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ప్రస్తుతం ఆ వ్యక్తి అక్కడే కరోనాకు కూడా చికిత్స పొందుతున్నారు. ఈ వ్యక్తి చికిత్స కోసం కొద్ది రోజులుగా ముంబైలోనే ఉండడంతో అక్కడే కరోనా సోకినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ నిర్ధారించింది.

- మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో కోవిడ్ రోగుల కోసం ప్రత్యేకంగా ఐసోలేషన్ వార్డు ఏర్పాటుచేశారు. మందులు, టెస్టింగ్ కిట్‌లు, ఆక్సిజన్ సిలిండర్లు సిద్ధంగా ఉంచి వైద్యసేవలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు.
- ప్రస్తుతం ఉమ్మడి వైఎస్సార్ జిల్లాతో పాటు రాష్ట్రంలో ఎక్కడా కరోనా కేసులు లేవని ఆరోగ్య శాఖ చెపుతోంది. కరోనా ఉందా...లేదా అనేది అనవసరం. ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే కరోనాతో పాటు ఏ రోగాలు దరికి చేరవని వైద్యులు సూచిస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి



కరోనాపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి మనకు ఎక్కడా కరోనా కేసులు నమోదు కాలేదు. వైఎస్సార్ జిల్లా పెద్ద చెప్పలి వాసి చికిత్స కోసం ముంబైకి వెళ్లారు. అక్కడ కరోనా కేసులు ఉండడంతో ఈ వ్యక్తికి అక్కడే కరోనా సోకింది. కాగా వైఎస్సార్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో అనుమానితులకు ఉచితంగా ర్యాపిడ్ టెస్టింగ్‌లు నిర్వహిస్తున్నాం. అందులో పాజిటివ్ వస్తే వీఆర్‌డీఎల్ ల్యాబ్‌కు పంపి కరోనాను నిర్ధారిస్తాం. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. మాస్కులు ధరించాలి. భౌతిక దూరం పాటించాలి.

– నాగరాజు, వైఎస్సార్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి



క్లుప్తంగా

నాటుసారా నిర్మూలనకు చర్యలు


మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

రాయచోటి : జిల్లాలో నాటుసారా నిర్మూలనకు చర్యలు చేపడదామని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. అన్నమయ్య జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన శుక్రవారం ఎస్ఈబీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాటుసారా తయారీ, రవాణాపై నిఘా పెట్టాలన్నారు. ప్రజలలో చైతన్యం తెచ్చేలా కౌన్సెలింగ్ నిర్వహించాలని చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న అక్రమ మద్యాన్ని అరికట్టేందుకు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహించాలన్నారు. పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించాలని వివరించారు. సమావేశంలో జిల్లాలోని ఎస్ఈబీ అధికారులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్యహత్యకు ప్రయత్నించిన సంఘటన శుక్రవారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. వెలిగల్లు పంచాయతీ నడింపల్లెకు చెందిన మధు (30) కారు డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆయన భార్య నందిని నెల రోజుల క్రితం భర్తతో మనస్పర్థల కారణంగా పుట్టింటికి వెళ్లింది. తిరిగి కాపురానికి రావాలని కోరినా ఆమె రాకపోవడంతో.. మధు మనస్తాపానికి గురై ఇంట్లోనే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పెద్దమండ్యం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నాయకుడిపై కార్యకర్త దాడి

కలకడ : మండలంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీకి చెందిన టీడీపీ నాయకుడు రెడ్డెప్పనాయుడుపై అదే పార్టీకి చెందిన కార్యకర్త, బాలయ్యగారిపల్లె పంచాయతీ యర్రయ్యగారిపల్లెకు చెందిన పాపయ్య కుమారుడు ఆనంద దాడి చేశాడు. హెడ్‌కానిస్టేబుల్ నాగరాజ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి కలకడ సిద్దేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన మహాభారతయజ్ఞం చూసుకుని తిరిగి రాత్రి 7.30 గంటల సమయంలో ఆనంద కె.దొడ్డిపల్లె గ్రామానికి చెందిన రెడ్డెప్పనాయుడును దారిలో అడ్డగించాడు. దుర్భాషలాడి, కొట్టి గాయపరిచినట్లు బాధితుడు పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొనకుండ ఉండలేరు!

- మట్టిపాత్రలతో శరీరానికి ఉపశమనం
- మండుటెండల్లో జోరుగా విక్రయాలు


కురబలకోట మండలం అంగళ్లులో మట్టి కుండలు



కురబలకోట : మట్టి కుండలు అనాదిగా వాడుకలో ఉన్నాయి. అల్యూమినియం, స్టీలు, ఇతర పాత్రల ప్రవేశంతో వీటికి ఆదరణ తగ్గింది. ఆధునిక (మెటల్) వంట పాత్రల వాడకం ద్వారా రోగాలు కూడా మనిషిని చుట్టుముట్టాయి. దీంతో మళ్లీ జనం ఆలోచనలో పడ్డారు. ఇప్పుడు వంటకు, తాగునీళ్లకు కుండలను ఆదరిస్తున్నారు. మట్టివి తిరిగి జన జీవన ప్రవంతిలో కన్పిస్తున్నాయి. వేసవిలో మట్టి కుండల్లో నీళ్లు తాగడం హాయి హాయిగా.. కూల్ కూల్‌గా అన్పిస్తుంది. వేసవి తాపాన్ని తీరుస్తాయి. దీంతో ఈ నీళ్లు మనస్సుకు హాయిని, శరీరానికి ఉపశమనాన్ని కల్గిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఇప్పుడు ఎండల సీజన్. ఒక పక్క ఉక్క పోత, మరో వైపు మండుటెండలు. ఇలాంటి పరిస్థితుల్లో మట్టి కుండ అనగానే ఎవ్వరికైనా చల్లని నీళ్లు గుర్తుకు వస్తాయి. చలివేంద్రాలు అంటే కూడా మట్టి కుండలే కన్పిస్తాయి. ఈ కుండల్లో నీళ్లు తాగితే వేసవి తాపం తీరుతుంది. ఆలక్లీన్ లక్షణాలు నీటిలోని పీహెచ్ స్థాయుల్ని సమతుల్యం చేస్తాయని చెబుతారు. జీవక్రియ మెరుగపడి పొట్టకు ఇబ్బంది లేకుండా చేస్తాయన్న పేరుంది. అంతేగాకుండా ఖనిజాలు, లవణాలు కూడా అందుతాయి. ఇలా చెప్పుకుంటూ పోతే మట్టి కుండల వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని నిపుణులు చెబుతారు. అన్నమయ్య, చిత్తూరు జిల్లాలో అంగళ్లు, కంటేవారి పల్లె, పలమనేరు, సదుం, మదనపల్లె దగ్గర సీటీఎం, ఈడిగపల్లె, కాండ్లమడుగు, కుమ్మరపల్లె తదితర ప్రాంతాల్లో వీటిని అమ్ముతున్నారు. రోడ్ల పక్కన స్టాల్స్‌లో వీటిని విక్రయిస్తున్నారు. ఉక్క పోత ఎక్కువగా ఉండడం ఎండలు మండుతుండడంతో వీటి అమ్మకాలు కూడా జోరుగా సాగుతున్నాయి. మట్టి కుండ అంటనే చల్లదనానికి మారుపేరు. దీంతో చలివేంద్రాలలో ఎక్కడ చూసినా మట్టి కుండలే కన్పిస్తాయి.

మట్టి కుండలకు పెట్టింది పేరు

మట్టి కుండలు, బొమ్మలు అంటేనే ఎవ్వరికైనా తొలుత గుర్తుకు వచ్చేది కురబలకోట మండలంలోని అంగళ్లు, కంటేవారి పల్లె, ఆ తర్వాత పలమనేరులోని ఘంటావూరు. వీటికి ఇవి ప్రసిద్ధి. ఇక్కడ సీఎఫ్‌సీ సెంటర్లు, ఆధునిక మిషన్లు ఉండడంతో వీటి తయారీలో హస్త కళాకారులు ఆరితేరారు. కుండలు, కడవలు రూ.120 నుంచి రూ. 300 చొప్పున అమ్ముతున్నారు. మగ్గులు రూ.150 నుంచి రూ.250, వాటర్ బాటిళ్లు రూ.150 నుంచి రూ.200, పెరుగు, మజ్జిగ కుండలు రూ.50 నుంచి రూ.70 చొప్పున విక్రయిస్తున్నట్లు హస్తకళాకారులు వెల్లడించారు.

వివిధ రాష్ట్రాలకు సరఫరా



కుండల తయారీ వెనుక కుమ్మరుల కృషి ప్రశంసనీయం. వేసవి వస్తే వీటికి తరగని డిమాండ్ ఉంటుంది. ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరిగింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు సరఫారా అవుతున్నాయి. వీటిలో నీళ్లు ఆరోగ్యానికి మంచిదని నిపుణులు కూడా చెబుతున్నారు. మూడు నెలలు వేసవి సీజన్ ఉంటుంది. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రూ.2 కోట్ల దాకా ఈ కుండల అమ్మకం ద్వారా లావాదేవీలు జరుగుతాయి.
– కృష్ణమూర్తి, టెర్రకోట హస్తకళాకారుల సలహాదారు

ఫ్రిజ్‌లున్నా వీటిపైనే మక్కువ



నగర, పట్టణ వాసులు సైతం ఫ్రిజ్‌లు ఉన్నా మట్టి కుండల వైపే చూస్తున్నారు. వీటిలో నీళ్లు సహజంగా చల్లబడతాయి. ఆరోగ్యానికి శ్రేయస్కరమని నిపుణులు చెబుతారు. మనిషి నాగరిగత నేర్చుకున్న తర్వాత మొదటి వంట చేసింది మట్టి పాత్రల్లోనే అని చెబుతారు. ఇవి ఇళ్లలో ఉండడానికి ఇష్టపడుతున్నారు. మరో వైపు పర్యావరణ ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
– శ్రీనివాసులు, హస్తకళాకారుల సంఘ నాయకులు, కురబలకోట మండలం

కుండ నీరు శ్రేయస్కరం



కుండ, కడవల్లోని నీరు ఎంతో మంచిది. ఇప్పటికీ పేదవాడి ఫ్రిడ్జ్‌గా పిలుస్తారు. సాధారణంగా మనిషి శరీరం ఆమ్లస్వభావం కల్గి ఉంటుంది. మట్టి ఆల్కలీన్. కుండనీళ్లు తాగినప్పుడు శరీర ఆమ్ల స్వభావంతో చర్య జరుపుతుంది. సరైన పీహెచ్‌కు దోహదపడుతుంది. భూమి వివిధ ఖనిజ లవణాల సహజ గని. దీని నుంచి వచ్చిన మట్టితో చేసే కుండలు, సామగ్రి ఆరోగ్య ప్రయోజనాలను కల్గిస్తుంది.
– బి.పద్మనాభరెడ్డి, పవర్ వాటర్ టెక్ నిర్వాహకులు, గుంతవారిపల్లె

ఔషధంతో సమానం



మట్టి కుండలతో పర్యావరణానికి కూడా మేలు. ఎలాంటి హాని లేదు. వేసవిలో నీరంతా చెమటగా పోతుంది. మట్టి కుండలు తాగునీటికే కాకుండా వంటలు చేసుకోడానికి కూడా ఎంతో బాగుంటాయి. వీటిలో చేసిన వంటలు రుచికరంగా ఉంటాయి. ఎక్కువ సేపు నిల్వ ఉంటాయి. ఆరోగ్యానికి శ్రేష్టం. వీటిలోని నీరు ఉపశమనం కల్గిస్తుంది. వడదెబ్బ తగలకుండా చేస్తుంది. వేసవి తాపం తీరుస్తుంది. మట్టి కుండ సహజ ఫిల్టర్‌గా పని చేస్తుంది. మలినాలను తొలగిస్తుంది. తద్వారా నీరు ఔషధంగా పని చేస్తుంది.
– ఎన్వీ ప్రసాద్ రావు, సోషల్ వర్కర్, కొరివివారిపల్లె, కురబలకోట మండలం

ఆకట్టుకునే వెరైటీలు



మారుతున్న కాలానుగుణంగా కొనుగోలుదారుల అభిరుచులను బట్టి కుండలు, కూజాలు, బాటిళ్లు తయారు చేస్తున్నాం. నవతరం కూడా వీటిని వినియోగించడానికి మక్కువ చూపుతున్నారు. మట్టి కుండలు, కడవలు, కూజాలు, వాటర్ బాటిళ్లు, గ్లాసులకు గిరాకీ ఉంది. వీటిని ఇష్టంగా కొంటున్నారు. రోజుకు ఒక్కో స్టాల్‌కు రూ.2 వేల నుంచిరూ. 3 వేల వరకు బేరం జరుగుతోంది. మూడు నెలల పాటు బేరసారాలు బాగా జరుగుతాయి.
– దుర్గం కళావతి, టెర్రకోట మ్యాక్స్ అధ్యక్షురాలు, కురబలకోట మండలం

ప్రాణం తీసిన ఈత సరదా

నీట మునిగి జేఎన్టీయూ విద్యార్థి మృతి


బాలాజీ మృతదేహం

కలికిరి : ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణం తీసింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కలికిరి జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్ విద్యార్థులు 10 మంది శుక్రవారం మధ్యాహ్నం కళాశాల సమీపంలోని నర్రావాండ్లపల్లి వద్దనున్న కొత్త చెరువు వద్దకు ఈతకెళ్లారు. వీరిలో ఈత వచ్చిన వారు చెరువు లోపలికి వెళ్లగా, రాని వారు నీరు తక్కువ ఉన్న ప్రాంతంలో ఈత కొడుతున్నారు. ఈ క్రమంలో సీఈసీ బ్రాంచ్ మొదటి ఏడాది విద్యార్థి కల్లూరు బాలాజీ(19) కూడా.. ఈత రాకపోవడంతో కుంట ప్రాంతం తక్కువ నీరున్న చోట నడుచుకుంటూ ఉన్నాడు. కుంటలో గుంతలు ఉండటంతో లోతు ప్రాంతంలో మునిగిపోయి కేకలు వేశాడు. గమనించిన స్నేహితులు బాలాజీని నీటిలో నుంచి బయటకు లాగడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. గట్టిగా కేకలు వేయడంతో నర్రావాండ్లపల్లి గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే విద్యార్థి నీటిలో మునిగిపోయాడు. దీంతో పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ లోకేష్‌రెడ్డి స్థానికులు, జేఎన్టీయూ సిబ్బంది సాయంతో గల్లంతైన విద్యార్థిని బయటకు తీశారు. మృతుడు రాజంపేట మండలం పులపత్తూరు గ్రామం సాలిపేటకు చెందిన కల్లూరు వెంకటరమణ కుమారుడు కల్లూరు బాలాజీగా గుర్తించి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. సరదాగా తమ వెంట ఈతకు వచ్చిన స్నేహితుడు కళ్లెదుటే గల్లంతై మృతి చెందడంతో విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు


గాయపడిన చౌడప్ప

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. కురబలకోట మండలం ముదివేడు పంచాయతీ పందివానిపెంట గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు చౌడప్ప (31) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. వారాంతపు సెలవుల్లో భాగంగా శుక్రవారం ద్విచక్ర వాహనంపై బెంగళూరు నుంచి ఇంటికి బయలుదేరారు. మదనపల్లె మండల సరిహద్దులోని చీకిలబైలు వద్ద వేగంగా వస్తూ స్పీడు బ్రేకర్ దాటే క్రమంలో అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అదే విధంగా చౌడేపల్లె మండలం చారాలకు చెందిన చిన్నరెడ్డెప్ప (32) శుక్రవారం వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంపై పుంగనూరుకు వెళుతుండగా శెట్టిపేట గ్రామం వద్ద ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నరెడ్డెప్ప తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా మారడంతో తిరుపతికి రెఫర్ చేశారు. సమాచారాన్ని ఔట్ పోస్టు సిబ్బంది చౌడేపల్లె పోలీసులకు అందజేశారు.

మహిళా మృతి కేసులో నిందితుడి అరెస్ట్

వాల్మీకిపురం : మహిళా మృతి కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ శివారు ప్రాంతంలోని ఏపీవై కాలనీకి చెందిన నరసింహులు కుమార్తె పార్వతి (34) ప్రైవేటు నర్సుగా పని చేస్తూ ఐదు రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న సీఐ నాగేంద్ర, ఎస్సై బిందుమాధవి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పార్వతి మృతికి మస్తాన్ కారకుడిగా పోలీసులు గుర్తించారు. శుక్రవారం సాయంత్రం పట్టణ శివారు ప్రాంతంలో ఉన్న మస్తాన్ (42)ను వారు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వరుసకు అన్న అయిన మస్తాన్ కొంత కాలంగా పార్వతితో సన్నిహితంగా ఉంటూ సహజీవనం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో అనుమానంతో పార్వతిని చంపి చెట్టుకు ఉరి వేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడని పోలీసులు దర్యాప్తులో తేల్చారు. దీంతో నిందితుడు మస్తాన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నాగేంద్ర తెలిపారు.


నిందితుడిని చూపుతున్న సీఐ, పోలీసులు

అంగరంగ వైభవంగా ఉరుసు

భక్తులతో కిటకిటలాడిన దర్గా ప్రాంగణం


కమలాపురం పెద్ద దర్గాలో ఖవ్వాలి వింటున్న శ్రోతలు


ఖవ్వాలి పాడుతున్న ఉస్తాద్ సలీం ఝున్‌కార్


విద్యుద్దీపాల అలంకరణలో ముఖ ద్వారం

కమలాపురం : కమలాపురం పట్టణంలో వెలసిన శ్రీ హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి, శ్రీ హజరత్ మౌలానా మౌల్వి ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి, శ్రీ హజరత్ జహీరుద్దీన్ షా ఖాద్రి ఖుద్దస సిర్రహుం వార్ల ఉరుసు మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గత మూడు రోజులుగా జరుగుతున్న ఉరుసు మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రధాన ఉరుసు మహోత్సవం భక్తుల కోలాహలం నడుమ వైభవంగా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచే కాక తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి ముస్లిం, హిందు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ఈ దర్గాకు కులమతాలకు అతీతంగా భక్తులు వేలాదిగా తరలి రావడంతో ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు దర్గాలోని స్వామి వారి మజార్లపై పూల చాదర్‌లు సమర్పించి చక్కెర చదివింపులు చేశారు. అలాగే పీఠాధిపతి మహమ్మద్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రిని భక్తులు గౌరవ పూర్వకంగా కలిసి ఆశీర్వాదం పొందారు. పిల్లల కోసం జాయింట్ వీల్స్, బ్రేక్ డ్యాన్స్, తదితర రంగుల రాట్నాలు దర్గా ఆవరణలో ఏర్పాటు చేశారు. అక్కడ కూడా భక్తుల కోలాహలం కనిపించింది. కాగా భక్తులకు మోహన్ బీడి యజమాని ఎస్. మహబూబ్ సాహెబ్ అన్నదానం ఏర్పాటు చేశారు.

అలరించిన ఖవ్వాలి పోటీ

కమలాపురం పెద్ద దర్గా ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకొని దర్గా ఆవరణలో ఏర్పాటు చేసిన ఖవ్వాలి పోటీ పోటా పోటీగా సాగింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఉస్తాద్ సలీమ్ ఝున్‌కార్, సర్‌పరాజ్ చిష్టిల మధ్య రెండో రోజు గొప్ప ఖవ్వాలి పోటీ రసవత్తరంగా సాగింది. ఖవ్వాలి విన్న ఖవ్వాలి ప్రేమికులు పాటలను వింటూ, మజా చేస్తూ ఖుషీ ఖుషీగా నజరానా సమర్పించారు. శుక్రవారం రాత్రి ప్రారంభమైన ఖవ్వాలీ పోటీ శనివారం తెల్లవారుజామున వరకు సాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఖవ్వాలి ప్రియులతో దర్గా మైదానం కిక్కిరిసింది.

మత సామరస్యానికి ప్రతీక కమలాపురం దర్గా


ప్రభుత్వ లాంఛనాలతో చాదర్‌లను తీసుకొస్తున్న డిప్యూటీ సీఎం, ఆర్టీసీ చైర్మన్, ఎమ్మెల్యే, జేసీ

కమలాపురం : కమలాపురం పెద్ద దర్గా మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని డిప్యూటీ సీఎం అంజద్ బాషా తెలిపారు. శుక్రవారం జరిగిన ఉరుసు మహోత్సవానికి ప్రభుత్వ లాంఛనాలతో దర్గాకు చాదర్ సమర్పణ కార్యక్రమానికి ఆయన ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, రాష్ట్ర హార్టికల్చర్ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, కడప మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ చంద్‌తో కలసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమలాపురం దర్గాకు ఘన చరిత్ర ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం పలుమార్లు ఈ దర్గా సందర్శించారన్నారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఈ దర్గా ఉరుసు మహోత్సవాలకు రాష్ట్రం నుంచే కాక కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలి వస్తారన్నారు. ఇలాంటి దర్గాకు ప్రభుత్వం నుంచి చాదర్ సమర్పించడం హర్షణీయం అన్నారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఏటా దర్గా-ఏ-గఫారియా ఉరుసు ఉత్సవాలకు తాము హాజరవుతామన్నారు. అయితే ఈ ఏడాది ప్రభుత్వం తరఫున చాదర్ సమర్పించడం సంతోషంగా ఉందన్నారు. జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ మాట్లాడుతూ ఇక్కడికి విచ్చేసిన భక్తుల కోరికలన్నీ నెరవేరాలని ఆశిస్తున్నామన్నారు. నిన్న సాయంత్రం ప్రభుత్వం తరఫున చాదర్ సమర్పించాలనుకోగానే తనకు పదోన్నతి లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం వారు దర్గా వరకు చాదర్‌లను ర్యాలీగా తీసుకెళ్లి మజార్లపై సమర్పించారు. ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు. పీఠాధిపతి నుంచి ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు ఇస్మాయిల్, వైఎస్సార్ సీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


మృతి చెందిన ఫైజ్


గాయపడిన ముబారక్

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడి విషమ పరిస్థితిలో వైద్య చికిత్సలు పొందుతున్నాడు. శుక్రవారం రాత్రి మదనపల్లెలో జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని సైదా పేటకు చెందిన ఫైరోజ్ కుమారుడు ఫైజ్(20) వెల్డర్‌గా, అతని స్నేహితుడు ముబారక్ (18) మెకానిక్‌గా పని చేస్తున్నారు. శుక్రవారం రాత్రి ఇద్దరూ కలసి వ్యక్తిగత పనులపై ద్విచక్రవాహనంలో బైపాస్ రోడ్డులోని నిమ్మనపల్లె సర్కిల్ వద్దకు వెళ్లారు. అక్కడి నుంచి బైపాస్‌లో ఇంటికి తిరిగొస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వారిదరూ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను హుటాహుటిన జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి ఫైజ్ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం ముబారక్‌కు చికిత్స అందించారు. అయితే అతని పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్య చికిత్సల కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.